అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ఆంజనేయులు

ఉప్పల్, ఆగస్టు 13 : ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలు, కోర్టు కేసులు, ఆక్రమణలు, చెరువుల కబ్జాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సర్కిల్ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేదిలేదని సూచించారు. సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, టీపీఎస్ సురేష్, టౌన్ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్,ఆగస్టు 13 : ఫెవికాల్ చాంపియన్ క్లబ్ అధ్యక్షులు ఎల్లాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలోమంగళవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేని హరీశ్ చేతన పాల్గొని మొక్కలు నాటారు. వెంకట్ రెడ్డి నగర్ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫెవికాల్ ప్రతినిధులు రవీంద్రచారి, పి. కనకాచారి,కె.రాఘవులు,విశ్వనాథుల రామకృష్ణ, శ్రీనివాస్,శంకర్,అనిల్చారి,సతీశ్,నర్సింహచారి,అజయ్,వెంకట్రెడ్డి, స్థానికులు గడ్డం సాయికిరణ్, పీసరి శంకర్,సుధాకర్,నవీన్రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

బీమ్రావునగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

మల్కాజిగిరి, ఆగస్టు 13: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం బీమ్రావు నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను కార్పొరేటర్తో కలిసి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన డ్రైనేజీని తొలగించి కొత్తగా డ్రైనేజీని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఆఫీసర్ శేఖర్, ఇమ్రాన్, యాదగిరిగౌడ్, అరుణ్, మల్లేష్గౌడ్, రేణుక, శ్వేత, లత, సాయికుమర్, శ్రీధర్, గోపాల్రావు, శోభ, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న బాలభారతి కరస్పాండెంట్ కపర్థీశ్వరావు

రామంతాపూర్,ఆగస్టు 13 : రామంతాపూర్ బాలభారతి పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం స్ఫూర్తి ఫౌండేషన్ అంధ విద్యార్థులకు రూ.11,880 ఆర్థిక సహాయాన్ని పాఠశాల కరస్పాండెంట్ కపర్థీశ్వరావు, స్వర్ణపుష్పం హృదయబారతి అధినేత మక్కపాటి మంగళ ,ఆచార్య రమేశ్ గూరూజీ చేతుల మీదుగా మంగళవాం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సుదర్శన్గౌడ్,వందన,తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు ఆహ్వానం

శామీర్పేట, ఆగస్టు 13 : శామీర్పేట వీరభద్రస్వామి విగ్ర హ ప్రతిష్ఠాపన మహోత్సవానికి విచ్చేయాలని ఎంపీ ఈటల రా జేందర్కు శామీర్పేట గ్రామస్తు లు ఆయన నివాసంలో మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

శామీర్పేట, ఆగస్టు 13: శామీర్పేట గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయ నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు నక్క ప్రభాకర్గౌడ్ రూ. 1లక్షల విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిశోర్యాదవ్, మాజీ ఎంపీటీసీ సాయిబాబు, అశోక్, మహేందర్యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్.గౌడ్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

హృతిక్ సింగ్(ఫైల్)

నేరేడ్మెట్, ఆగస్టు 13: యువకుడు అదృశ్యమైన సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సైదులు కథనం ప్రకారం.. జేజేనగర్లో నివాసం ఉంటున్న సుబేదార్ సంజయ్ కుమార్సింగ్ తనయుడు హృతిక్ సింగ్ (23). మంగళవారం ఉదయం నేరేడ్మెట్ డంప్యార్డ్ వద్దకు వెళ్లి చెత్తబండి ఎక్కి వెళ్లి పొయినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనతి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని తెలిపారు.

సర్కారు భూములను కాపాడుతాం

జవహర్నగర్లో జేసీబీతో అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తున్న దృశ్యం

నేరేడ్మెట్: జేజేనగర్లోని ఫుట్పాత్పై ఉన్న షెడ్డును తొలగించిన సిబ్బంది

జవహర్నగర్, ఆగస్టు 13: జవహర్నగర్ కార్పొరేషన్లోని సర్కారు భూములకు కంచెలు వేసి కాపాడుతున్నామని, కబ్జాదారులు ప్రభుత్వ భూముల జోలికివస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జవహర్నగర్ కార్పొరేషన్లోని చెన్నాపురం, లక్ష్మీనర్సింహకాలనీ, వికలాంగులకాలనీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీతో నేలమట్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, సిబ్బంది కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్పాత్ ఆక్రమణలు తొలగింపు

నేరేడ్మెట్ : మల్కాజిగిరి డీసీ ఆదేశాల మేరకు నేరేడ్మెట్ జేజెనగర్, డిఫెన్స్కాలనీలోని ఫుట్పాత్పై ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్న షాపులను మంగళవారం పోలీసుల సహాయంతో జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా వారు ఫుట్పాత్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఫుట్పాత్ వ్యాపారస్తులు మాట్లాడుతూ కొన్నేండ్లనుంచి ఇదే తమ జీవనాధారమని, ఇప్పుడు ఇక్కడ దుకాణాలు తొలగిస్తే మేం వ్యాపారాలు ఎలా చేసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. ఇది కక్షపూరితమైన చర్యలని, అధికారులు తమ గోడు అర్థం చేసుకోవాలని కోరుతున్నారు.

సీలింగ్ ల్యాండ్లో..

ఘట్కేసర్: పోచారం మున్సిపాలిటీ 1వ వార్డులోని యంనంపేట్ గ్రామంలో సర్వే నంబర్ 91లో సీలింగ్ ల్యాండ్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ సాయిరాం నేతృత్వంలో రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు.

అల్వాల్లో హైడ్రా స్పెషల్ ఆఫీసర్ల తనిఖీలు

మల్కాజిగిరి: అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝుళిపిస్తున్న హైడ్రా స్పెషల్ ఆఫీసర్లు మంగళవారం అల్వాల్లోని శ్రీసాయి సూర్య కాలనీలోని అక్రమంగా పార్కు స్థలాన్ని ఆక్రమించి కట్టడాలను పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు స్పందించిన హైడ్రా స్పెషల్ ఆఫీసర్ స్థానికంగా వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. అక్రమమని గుర్తిస్తే వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పోచారం మున్సిపాలిటీ యంనంపేట్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

చర్లపల్లి, ఆగస్టు 13: వేడుకలు, శుభాకార్యాల్లో హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం కుషాయిగూడ పోలీస్స్టేషన్లో హిజ్రాల గురువులు, సీసీఎస్ ప్రతినిధులు, స్థానిక కాలనీవాసులతో ఇన్స్పెక్టర్ అంజయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్స్టేషన్ పరిధిలోని కాలనీలలో జరిగే శుభాకార్యాలు, వేడుకలు, ప్రారంభోత్సవాలలో హిజ్రాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై సమగ్రా విచారణ చేపట్టడంతో పాటు హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు ఎంపెల్లి పద్మారెడ్డి, ఎస్ఏ.రహీం, కొండూరి మురళిపంతులు, పురుషోత్తంరెడ్డి, షాబాద్ దామోదర్రెడ్డి, డాక్టర్ కుమార్స్వామి, చిన్న, దుర్గారెడ్డి, రాజు, నవీన్, విజయ, సుజాత, శ్రీనివాస్, శివలతో పాటు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్స్పెక్టర్కు విన్నవిస్తున్న సీసీఎస్ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

పల్లెల అభివృద్ధికి కృషి చేయాలి

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 13 : పల్లె అభివృద్ధికి మనవంతు కృషిచేయాలని రూరల్ డెవలప్మెంట్ కేంద్ర మంత్రి శివరాజసింగ్ చౌవాన్ అన్నారు. మంగళ వారం రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్లోని నేషనల్ ఇనిసిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయతీరాజ్ (ఎన్.ఐ.ఆర్.డి.-పీఆర్) సమావేశపు మందిరంలో 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డైరెక్టర్ జనరల్ డా.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రధానంగా గ్రామీణ ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అమలు కావాలని సూచించారు. వెదురుతో రూ.4 లక్షలలోపే తక్కువ ఖర్చుతో గృహనిర్మాణం చేపట్టవచ్చని సూచించారు. పి.ఎం.జి.ఎస్.వై., పి.ఎం.ఏ.వై . పథకాలను సద్వినియోగించుకోవాలని .సూచించారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సహాయ మంత్రి కమలేశ్ పవార్,అధికారులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్సింగ్

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

కీసర, ఆగస్టు 13: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ ఆనంద్రెడ్డి అన్నారు.మండల పరిధి చీర్యాల్ గ్రామంలో మంగళవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఈగ శ్రీనివాస్, ఆసోసియేట్ అధ్యక్షులుగా చెన్నూరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, మహిళా ఉపాధ్యక్షులుగా విజయశ్రీ, సెక్రటరీగా పూండ్రు సుధాకర్, మహిళా కార్యదర్శిగా జ్యోత్సలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ సందర్భంగా మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఎన్నికైన చీర యాదగిరి మాట్లాడుతూ సంఘం ప్రటిష్టతకు అహర్నిశలు శ్రమిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు వేధవతి, విద్యాసాగర్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంవెంకటేశం, రవీందర్, రామచంద్రయ్య, ప్రవీణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం

బస్సుల బుకింగ్పై 10 శాతం రాయితీ

మేడ్చల్, ఆగస్టు 13 : శ్రావణమాసం, శుభ ముహూర్తల సందర్భంగా పండుగలు శుభ కార్యాలయాలకు బస్సులు బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సౌకర్యం కల్పించనట్టు డిపో మేనేజర్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 3 వరకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. అన్ని రకాల బస్సులపై రాయితీని పొందవచ్చన్నారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పీఏకు శ్రీదేవి సినీ అవార్డు

కాప్రా, ఆగస్టు 13:తెలంగాణ రాష్ట్ర ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిజం, సామాజిక సేవారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినవారికి ప్రతి ఏటా సినీనటి శ్రీదేవి జయంతి సందర్భంగా ఇచ్చే అవార్డును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పీఏ ఆలేటి రమేశ్కు సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. నగరంలోని హిమాయత్నగర్లో జరిగిన కార్యక్రమంలో రమేశ్కు ఈ అవార్డును అందజేశారు. తనకు ఈ అవార్డును అందజేసినందుకు ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ సంస్థకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

హోటల్ తనిఖీ..నోటీసులు జారీ

ఘట్కేసర్,ఆగస్టు13: పరిశుభ్రతపై ఘట్కేసర్ మున్సిపాలిటీ అధికారులు మంగళవారం స్థానిక హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ ఎండీ సాబేర్ అలీ ఆదేశానుసారం స్థానిక అన్నపూర్ణ హోటల్ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు నిల్వ ఉండి పురుగు పడిన ఆహార పదార్థాలను మున్సిపాలిటీ అధికారులు గుర్తించారు. మేనేజర్ వెంకట్ రెడ్డి,శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పోలీసులతో కలిసి వెళ్లి హోటల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.8వేల జరిమానా విధిస్తూ, హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందించారు.

బీసీ బాయ్స్ హాస్టల్లో ఏసీబీ ఆకస్మిక దాడులు

వంట గదిలో వంటలను పరిశీలిస్తున్న ఏసీబీ,ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులు

మల్లాపూర్,ఆగస్టు13: మీర్పేట్ హెచ్బీ కాలనీ డివిజన్ మల్లాపూర్ ప్రధాన రోడ్డులో ఉన్న బీసీ బాయ్స్ హాస్టల్లో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో విద్యార్థుల హాజరు రిజిస్టర్ను తనిఖీ చేయగా హాస్టల్ 70 మంది విద్యార్థులు ఉండగా రిజిస్టర్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా భోజనం నాసిరకంగా ఉందని వీటి అంశాలపై ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ అధికారులతో పాటు తూనికలు కొలతల శాఖ అధికారులు, ఫుడ్ఇన్స్పెక్టర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి, కౌన్సిలర్లు ఉమానాగరాజు, స్వామియాదవ్

మేడ్చల్, ఆగస్టు 13 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదు, 16వ వార్డుల్లో రూ. 11లక్షలు, రూ.14 లక్షలు చేపట్టిన సీసీ రోడ్ల పనులను మంగళవారం మున్సిపాలిటీ చైర్పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి మంగళవారం కౌన్సిలర్ ఉమానాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రతి వార్డులో సీసీ రోడ్డు, బీటీ రోడ్లు నిర్మించామన్నారు.

కార్యక్రమం లో కౌన్సిలర్ స్వామియాదవ్, ఉమానాగరాజు,కమిషనర్నాగిరెడ్డి,నాయకులు కుమ్మరి సత్తయ్య, కృష్ణ ముదిరాజ్, నాచారం సత్త య్య, నర్సింహ గౌడ్, అబ్దుల్ బారి, బబ్బన్న, వేణు, బాలరాజ్, బాలమల్లేశ్ యాదవ్, మహబూబ్పాష, ఇంజినీర్ విగ్నేశ్, వార్డు అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తా..

సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

ఉప్పల్, ఆగస్టు 13: కాలనీలోని సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయి జెన్ శేఖర్ అన్నారు. నాచారం డివిజన్లోని వీరారెడ్డినగర్కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలలో వరదనీటి సమస్యలను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. గతంలో వరదనీరు నిలిచి ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించి, సమస్యల పరిష్కారానికి అదనపు పైపులైన్లు వేశామన్నారు. అదేవిధంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వర్షపు నీటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్కుమార్, బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, దాసరి కర్ణ, మార్షల్ నర్సింగ్ రావు, రెబల్ రాజు, చిన్న రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి హెచ్బీఎల్ సంస్థ కృషి

లక్ష్మాపూర్లో అంగన్వాడీ కేంద్రాలకు వంట సామాగ్రి పంపిణీ చేస్తున్న హెచ్బీఎల్ సంస్థ ప్రతినిధులు

శామీర్పేట, ఆగస్టు 13 : అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి హెచ్బీఎల్ సంస్థ కృషి చేస్తుందని గ్రామ మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు అన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, అనంతారం గ్రామాల్లోని 5 అంగన్వాడీ కేంద్రాలకు మంగళవారం హెచ్బీఎస్ సంస్థ సీఎస్ఆర్ కింద వంట సామాగ్రి ప్రెషర్ కుక్కర్లు, గోడ గడియారాలు, గిన్నెలు, పాలు తాగే కప్పులతో పాటు చిన్నారులకు ప్రతి రోజు అరటి పండ్లు, పాలు, చిక్కీలను అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్బీఎల్ సంస్థ సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ హనుష్ సుర్పనేని, కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, ప్రతినిధులు, గ్రామస్తులు,అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం..చిన్నారికి శాపం

- మిరాకిల్ దవాఖానలో దారుణం
- 25 రోజులుగా కవలలకు వైద్యం
- ఒక చిన్నారి చేతి వేళ్లకు ఇన్ఫెక్షన్
- వైద్య సిబ్బంది నిర్వాకమే కారణం: తల్లిదండ్రులు
- దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన
- దవాఖానను సందర్శించిన డీఎంఅండ్హెచ్వో

చిన్నారి చేతి వేళ్లకు సోకిన ఇన్ఫెక్షన్

దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు

మేడ్చల్, ఆగస్టు 13: వైద్యులు నిర్లక్ష్యం చిన్నారికి శాపంగా మారింది. 25రోజుల పాటు వైద్యం అందించిన తర్వాత చేతి వేళ్లకు ఇన్ఫెక్షన్ సోకిందని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చేతి వేళ్లకు ఇన్ఫెక్షన్ వచ్చిందని ఆ బిడ్డ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యానికి రూ.10 లక్షలు తీసుకొని, చేతివేళ్లు తొలగిస్తామని చెపుతున్న దవాఖాన నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మొండికుంట తండాకు చెందిన సుధాకర్ నాయక్, అనిత దంపతులు 25 రోజుల కింద పీర్జాదిగూడ శ్రీజ దవాఖానలో ప్రసవం జరిగింది. ఇద్దరు కవల పిల్లలు జన్మినించారు. పరీక్షల నిమిత్తం పీర్జాదిగూడలోని మిరాకిల్ దవాఖానకు తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు పిల్లలు పరిస్థితి బాగా లేదని 25 రోజులుగా ఐసీయూలో ఉంచి, వైద్యం అందిస్తున్నారు. వైద్యం అందించడంలో భాగంగా ఒక చిన్నారికి సెలైన్ ఎక్కించే క్రమంలో చేతి వేళ్లను గాజు బట్టతో కట్టారు. ఇలా కట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రక్తప్రసరణ ఆగిపోయి, చేతివేళ్లు చచ్చు పడిపోయాయి. అయితే సిబ్బంది ఈ ఘోర తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడానికి చేతి వేళ్లకు ఇన్ఫెక్షన్ సోకిందని, చేతివేళ్లు ఊడిపోతాయని తల్లిదండ్రులు, బంధువులకు చెప్పారు. జరిగిన విషయాన్ని గుర్తించిన వారు దవాఖాన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. 25 రోజుల వైద్యానికి రూ.10లక్షలు చెల్లించామని, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై చర్య లు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్వో రఘునాథ స్వామి దవాఖానను సందర్శించారు. ఘటనపై విచారణ జరిపారు.

యువకుడు ఆత్మహత్య

చర్లపల్లి, ఆగస్టు 13 : మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగ్గా లేక ఓ యవవకుడు బిల్డింగ్పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..డివిజన్ పరిధి ఈసీనగర్లో కొంత కాలంగా కుటుంబసభ్యులతో కలిసి శిరీష్రెడ్డి(28)కలిసి నివాసముంటున్నాడు. మూడు సంవత్సరాల నుంచి ఉద్యోగం లేక మ ద్యానికి బానిసైయ్యాడు. దీంతో పాటు మతిస్థిమి త్తంసరిగ్గా లేకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు దవాఖానలో చికిత్స చేయించారు. సో మవారం శిరీష్రెడ్డి తాను నివాసముండే మూడో అంతస్తుపైకి వెళ్లి కిందకు దూకడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు పేర్కొనడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అదృశ్యం

శామీర్పేట,ఆగస్టు13: వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైన ఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం..బొమ్మరాశిపేట గ్రామానికి చెందిన వెంకటేశ్(22)ట్రాక్టర్ డ్రైవర్. ఈనెల 12వ తేదీన పనికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు ఇండ్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో బొమ్మరాశిపేట గ్రామానికి చెందిన సాజియా(19) కంప్యూటర్ క్లాస్కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శామీర్పేట పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చర్లపల్లిలో..

చర్లపల్లి: చర్లపల్లి పోలీస్ పరిధిలోని అంబేద్కర్ నగర్కు చెందిన వడ్ల జగదీశ్వర్ చారి(45) కార్పెంటర్గా పనిచేస్తూ భార్య జ్యోతితో కలిసి నివాసముంటున్నాడు. సోమవారం ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాకపోవడం తో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.